

ఎన్.నర్సాపురం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

నక్కపల్లి, సెప్టెంబరు 17: మండలంలోని ఎన్.నర్సాపురం పంచాయతీ కార్యదర్శి కె.బాబూరావును సస్పెండ్ చేస్తూ డీపీవో ఆర్.శిరీషారాణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయని, రికార్డులను సరిగా నిర్వహించడంలేదని పలువురు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఇటీవల విచారణ చేపట్టి పంచాయతీ రికార్డులను సీజ్ చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేనందుకు కార్యదర్శి బాబూరావును సస్పెండ్ చేశారు. సర్పంచ్ నాగరత్నం చెక్‌పవర్‌ను మూడు నెలలపాటు రద్దు చేశారు.

కారిడార్ భూ సమస్యల అర్జీలపై సమగ్ర విచారణ

- కలెక్టర్ విజయకృష్ణన్
- పరిహారం అందలేదని 441 మంది రైతులు వినతిపత్రాలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించి 15 రోజుల్లో నివేదిక
- సమస్యలు పరిష్కరించాకే కారిడార్ పనులు చేపట్టాలని నిర్వాసితులు డిమాండ్



నక్కపల్లి మండల భూ నిర్వాసిత రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, ఇతర అధికారులు

అనకాపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూములకు, స్థలాలకు సంబంధించి నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో అందిన అర్జీలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నక్కపల్లి మండలంలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ కారణాలతో నష్టపరి హారం అందని 441 మంది రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చందనాడ నుంచి 237, బుచ్చెయ్యపేట నుంచి 18, డీఎల్‌పురం నుంచి 48, రాజయ్యపేట నుంచి 54, వేం పాడు నుంచి 84 దరఖాస్తులు అందినట్టు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి 15 రోజుల్లో నివేదిక రూపొందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్‌తోపాటు జేసీ జాహ్నవి, డీఆర్‌ఓ దయానిధి, నర్సీపట్నం ఆర్డీఓ జయరామ్, ఏపీఐఐసీ ఎస్‌డీసీ రమామణి తదితరులు అర్జీలు స్వీకరించి, నిర్వాసిత రైతుల సమస్యలను ఆలకించారు. నక్కపల్లి తహసీల్దార్ అంబేడ్కర్, సీఐ కుమారస్వామి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కారిడార్ నిర్వాసితులు, రైతు సంఘం ప్రతినిధులు

సమస్యలు పరిష్కరించాకే కారిడార్ పనులుచేపట్టాలి

నక్కపల్లి, సెప్టెంబరు 17: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం నక్కపల్లి మండలంలో భూములిచ్చిన రైతుల సమస్యలు పరిష్కరించిన తరువాతే పనులు చేపట్టాలని రైతు సంఘం ప్రతినిధులు కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కారిడార్ నిర్వాసిత రైతుల స్పెషల్ గ్రీవెన్స్‌కు పలువురు సర్పంచులు, రైతు సంఘం ప్రతినిధులు హాజరయ్యారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ రూ.15 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని, ఇళ్లు కోల్పోయిన వారికి రూ.25 లక్షలు ప్యాకేజీ ఇచ్చి, ఆర్‌ఆర్ కార్డులు జారీచేయాలని, కారిడార్‌లో ఏర్పాటయ్యే పరిశ్రమల్లో యువతకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని, మత్స్యకారుల ఉపాధి కోసం ఫిషింగ్ జెట్టీ నిర్మించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్... తన పరిధిలో వున్న సమస్యలను పరిష్కరిస్తానని, ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, నాయకులు వంకా కృష్ణ, గెడ్డమూరి గోవింద్, చందనాడ, బుచ్చిరాజుపేట సర్పంచులు తళ్లా రోహిణి, కాళ్ల శ్రీనివాసరావు, చందనాడ ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, రైతు సంఘం ప్రతినిధులు సూరకాసుల గోవింద్, తళ్లా భార్గవ్, తళ్లా అప్పలస్వామి, పుణ్యమంతుల బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటీన్ ఓపెన్

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఎదుట ప్రారంభించనున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



ముస్తాబైన అన్న క్యాంటీన్ భవనం

నర్సీపట్నం, సెప్టెంబరు 17: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి ఎదురుగా అన్న క్యాంటీన్ పునః ప్రారంభానికి మునిసిపల్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తారు. ఐదు రూపాయలకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందుబాటులో వుంటాయి. రోజు వారీ కూలీలు, గ్రామీణ ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చేవారు, ఆటో డ్రైవర్లు, ఇతర పేద వర్గాల వారికి అన్న క్యాంటీన్ నామమాత్రం ధరతో ఆకలి తీరుస్తుందని అధికారులు చెబుతున్నారు. పురపాకల సంఘం సాధారణ నిధులు రూ.9 లక్షలతో అన్న క్యాంటీన్ భవనానికి మరమ్మతులు, విద్యుత్, ప్లంబింగ్ పనులు చేయించారు. కాగా టీడీపీ గతంలో అధికారంలో వున్నప్పుడు 2019 జనవరి 11వ తేదీన ఏరియా ఆస్పత్రి ఎదురుగా అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయ దురుద్దేశంతో మూసివేయించిన విషయం తెలిసిందే. ఇదిలావుండగా ప్రస్తుత శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు గత సంవత్సరం కాలంగా మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా రూ.2లకే భోజనం పెడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తున్నారు.

ఇసుక దోపిడీ

వరహా, సర్పానదుల్లో యథేచ్ఛగా తవ్వకాలు

- టైరు బండ్లతో పగటిపూట ఇసుక తీత
- సమీపంలోని తోటల్లో నిల్వ
- చీకటిపడిన తరువాత లారీల్లోకి లోడింగ్
- ఇతర ప్రాంతాలకు రవాణా
- లారీ ఇసుక రూ.20 వేలకు అమ్ముకుంటున్న అక్రమార్కులు



ఇందేశమ్మవాక వద్ద వరహా నదిలో టైరు బండ్లతో ఇసుక సేకరిస్తున్న దృశ్యం

కోటవురట్ల, సెప్టెంబరు 17: అటు గోదావరి, ఇటు నాగావళి, వంశధార నదుల్లో వరద ఉధృతి కారణంగా అనకాపల్లి జిల్లాకు ప్రభుత్వ పరంగా ఇసుక సరఫరా కష్టతరంగా మారింది. జిల్లాలోని నదుల్లో కూడా వరద నీరు ప్రవహిస్తుండడంతో భవన నిర్మాణ పనులకు ఇసుక కొరత ఏర్పడింది. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు ఇసుక అక్రమ తవ్వకాలకు తెర తీశారు. వరహా నదికి ఇటీవల భారీ ఎత్తున వరదలు రావడంతో మండలంలోని గొట్టివాడ, ఇందేశమ్మవాక, రామచంద్రపురం, పందూరు గ్రామాల పరిధిలో పెద్ద ఎత్తున ఇసుక మేటలు వేసింది. దీంతో నదికి ఇరువైపులా వున్న గ్రామాల్లో స్థానబలం వున్న రాజకీయ నాయ కుల ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రామచంద్రపురం వద్ద వరహా నదిలో నుంచి ఇసుకను తీసుకువచ్చి సమీపంలోని తోటల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రిపూట లారీలు, టిప్పర్లలో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై రామచంద్రాపురం గ్రామానికి చెందిన కొంతమంది మంగళవారం ఫొటోలతోసహా తహసీల్దార్‌కు ఫిర్యాదుచేశారు. రాజుపేట వద్ద సర్పా నది నుంచి టైరు బండ్లతో ఇసుకను అక్రమంగా తరలించి సమీపంలోని మామిడి, జీడిమామిడి తోటల్లో నిల్వ చేస్తున్నారు. చీకటి పడిన తరువాత లారీల్లోకి లోడింగ్ చేసి తరలిస్తున్నారు. లారీ ఇసుక రూ.20 వేలకు అమ్ముతున్నట్టు తెలిసింది. రోజూ పది నుంచి 20 లారీల వరకు ఇసుక తరలిపోతున్నది.



రామచంద్రపురం సమీపంలో లారీలోకి లోడింగ్ చేసిన ఇసుక

నర్సీపట్నంలో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం

ఖేల్ ఇండియా కార్యక్రమం కింద ఏర్పాటుకు కృషి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 17 : కేంద్ర ప్రభుత్వ ఖేల్ ఇండియా కార్యక్రమం కింద నర్సీపట్నంలో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తున్నామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్థల పరిశీలన చేశారు. ఈ ప్రాజెక్టులో క్రీడా శిక్షణా కేంద్రం కూడా ఉంటుందని, ఇతర జిల్లాల క్రీడాకారులు సైతం ఇక్కడకు వచ్చి శిక్షణ తీసుకోవచ్చని ఆయన తెలిపారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ సహకారంతో ఈ పనులు పూర్తి చేస్తామని అన్నారు. గతంలో ఇండోర్ స్టేడియం మంజూరు చేశామని, గత వైసీపీ ప్రభుత్వం పట్టించకోకపోవడంతో నిధులు వెనక్కి పోయాయని చెప్పారు. అనంతరం ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న స్కేటింగ్ రింక్ వద్దకు వెళ్లి పరిశీలించారు. గత ఐదేళ్లలో నిర్వహణ లేక స్కేటింగ్ రింక్ అధ్వానంగా తయారైందని ఆరోపించారు. రింక్‌కు మరమ్మతులు చేయించి భవిష్యత్తులో రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తామని అయ్యన్నపాత్రుడు చెప్పారు. అనంతరం అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ సరేంద్ర, టీడీపీ పట్టణ కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ, వార్డు కౌన్సిలర్ దనమిరెడ్డి మధు, నాయకులు లాలం మురళీ, పెదిరెడ్ల చింతు, ఫైల గోవింద్, సూర్యచంద్ర తదితరులు వున్నారు.

ధారమఠంలో శివుని విగ్రహం ధ్వంసం

- గుర్తు తెలియని వ్యక్తులు దుశ్చర్య
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఈవో



గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన శివుని విగ్రహం

గొలుగొండ, సెప్టెంబరు 17: మండలంలోని కొత్తపాలెం గ్రామం వద్ద ఉమాధారమల్లీశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న శివుని విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై ఆలయ ఈవో కె.దివ్యతేజ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని పాతమల్లంపేట పంచాయతీ శివారు కొత్తపాలెం గ్రామం వద్ద ప్రఖ్యాత ఉమాధారమల్లీశ్వరస్వామి ఆలయం వుంది. ఈ ప్రాంగణంలో తపస్సు చేసుకుంటున్న శివుడి రూపంలో విగ్రహాన్ని గతంలో ప్రతిష్ఠించారు. ఆలయానికి వచ్చే భక్తులు ఈ విగ్రహం వద్ద కూడా పూజలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శివుడి విగ్రహం ముక్కు, చేతులు, తలపైఉన్న పాక్షికంగా ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి ఈ విషయాన్ని గుర్తించి ఆలయ ఈవో దివ్యతేజకు ఫోన్‌కుచేసి చెప్పారు. ఆమె ధారమఠం చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సున్నితమైన ఈ సంఘటనపై విచారణ చేపట్టాలని ఎస్ఐ రామారావును కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

వంట నూనెలు సలసల

కిలోకు రూ.15 నుంచి రూ.20 పెంపు

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వంట నూనెల ధరలు పెరిగాయి. సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ బ్రాండ్‌ను బట్టి సగటున కిలో రూ.110 నుంచి రూ.120 మధ్య విక్రయించేవారు. నాలుగు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం వంట నూనెల దిగుమతి సుంకం పెంచనున్నట్టు వెల్లడించింది. దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కానీ డీలర్లు, వ్యాపారులు మాత్రం దానిని సాకుగా తీసుకొని రేట్లు పెంచేశారు. లీటరుకు రూ.15 నుంచి రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారు.

- మార్కెట్‌లో ఫ్రీడమ్ ఆయిల్ రూ.130
- పట్టించుకోని విజిలెన్స్ అధికారులు



నగరంలో రిటైల్ వ్యాపారులు రెండు రోజులకు ఓసారి డీలర్ నుంచి స్టాకు తెప్పించుకుంటారు. రేట్లు పెరిగాయని, వాటి ప్రకారమైతే పంపిస్తామని డీలర్లు చెప్పడంతో రిటైలర్లు కొత్త రేట్ల ప్రకారం అమ్మకాలు సాగిస్తున్నారు. అంతేకాకుండా రేట్లు ఇంకా పెరిగే అవకాశం ఉందని చెబుతూ స్టాకిస్టులు వ్యాపారులు అడిగినంత సరకు ఇవ్వకుండా కొద్దికొద్దిగానే ఇస్తున్నారు. వినాయ చవితిని పురస్కరించుకుని రోజూ ప్రసాదాలు తయారీ, అన్నదానాలు పెద్దఎత్తున నిర్వహిస్తుండడంతో వంటనూనెల విక్రయాలు భారీగా సాగుతున్నాయి. దాంతో డీలర్ల పంట పండింది. కిలోకు అడ్డంగా రూ.15 నుంచి రూ.20 అదనంగా దోచుకుంటున్నారు. గత నాలుగు రోజులుగా ఇదే తంతు సాగుతోంది. ప్రస్తుతం నగరంలోని రిటైలర్లు ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను లీటరు రూ.130 చొప్పున అమ్ముతున్నారు. సీతమ్మధార రైతుబజార్ సమీపాన ఉన్న సూపర్ మార్కెట్లలో లీటరు రూ.122 నుంచి రూ.124 వరకు అమ్ముతున్నారు.

ఎంఆర్‌పీ పేరుతో దోపిడీ

డీలర్లు, స్టాకిస్టులు గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) పేరుతో ప్రభుత్వాన్ని, కొనుగోలుదారులను మోసం చేస్తున్నారు. తనిఖీల సమయంలో దొరక్కుండా ఉండేందుకు ముందుగానే అధిక ధరలు ముద్రిస్తున్నారు. సాధారణ సమయాల్లో వాటిని రాయితీపై ఇస్తున్నట్టు చెబుతున్నారు. ఇలా అనధికారికంగా రేట్లు పెంచినప్పుడు ఎంఆర్‌పీకే ఇస్తున్నామని బుకాయిస్తున్నారు. ఇప్పుడు నగరంలో అమ్ముతున్న ఫ్రీడమ్ రిఫైన్డ్ ఆయిల్ ప్యాకెట్లపై ఎంఆర్‌పీ రూ.144 ముద్రించి ఉంది. అంటే తాము ఆ రేటుకే ఇస్తున్నామని, ఎక్కువ ధరకు అమ్మడం లేదని చెబుతున్నారు. కేసులు లేకుండా తప్పించుకోవడానికి ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారు.

మొద్దునిద్రలో విజిలెన్స్

రాష్ట్రంలో వంట నూనెల ధరలు భారీగా పెంచేశారని గత మూడు రోజులుగా విస్తృత ప్రచారం జరగడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీశ్‌కుమార్ గుప్తా అన్ని జిల్లాల్లో స్టాకిస్టులు, డీలర్లు, రిటైలర్లపై దాడులు నిర్వహించాలని ఆదేశించారు. చాలా జిల్లాల్లో ఈ తనిఖీలు జరిగాయి. విశాఖలో మాత్రం మంగళవారం రాత్రి 8 గంటల వరకు విజిలెన్స్ అధికారుల నుంచి దీనిపై ఎటువంటి సమాచారం లేదు. కొన్ని పెద్ద వ్యాపార సంస్థలకు ముందుగా సమాచారం వెళ్లిందో ఏమో చిత్రాలయ ఎదురుగా ఉన్న పెద్ద వ్యాపార సంస్థలో లీటరు రూ.112కే బోర్డులు పెట్టి విక్రయించారు. వంట నూనెల ధరలు పెరగలేదని, గతంలో రేటుకు మాత్రమే విక్రయించాలని ప్రచారం చేయాల్సిన అధికారులు మౌనంగా ఉన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యతా లోపం

భారీ వాహనాలతో పలుచోట్ల బీటలు వారిన కేబీ రోడ్డు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 17: కశింకోట- బంగారుమెట్ట రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపాలు బయటపడుతున్నాయి. భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో పలుచోట్ల తారు రోడ్డు బీటలు వారింది. కొన్నిచోట్ల కుంగిపోయింది.



దిబ్బిడి వద్ద దెబ్బతిన్న రోడ్డు.

కశింకోట-బంగారుమెట్ట రోడ్డును రూ.32 కోట్ల వ్యయంతో గత ఏడాది 25 అడుగుల మేర విస్తరించి, అభివృద్ధి చేశారు. అవసరమున్నచోట సీసీ రోడ్డు వేశారు. సిమెంట్ పైపులతో కల్వర్టులు, రక్షణ గోడలు నిర్మించారు. కశింకోట నుంచి రాజాం వరకు 25 అడుగుల మేర తారు రోడ్డు వేసిన ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు.. రాజాం నుంచి బంగారుమెట్ట వరకు కొత్తగా వేసిన రోడ్డుకు బీటీ వేసి, పాతరోడ్డును అలాగే వదిలేశారు. కాగా బీఎన్ రోడ్డు అధ్వానంగా వుండడం, విజయరామరాజుపేట, వడ్డాది వద్ద వంతెనలు కూలిపోవడం, ఇదే సమయంలో కేబీ రోడ్డును విస్తరించి, అభివృద్ధి చేయడంతో భీమునిపట్నం-నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో ప్రయాణించాల్సిన రవాణా వాహనాలు కేబీ రోడ్డు మీదుగా వెళుతున్నాయి. మాడుగుల, బుచ్చెయ్యపేట మండలాల్లోని గ్రానైట్ క్వారీల నుంచి సుమారు 50 టన్నుల బరువున్న బండరాళ్లను రవాణా చేస్తున్న లారీలు కేబీ రోడ్డు మీదుగా వెళుతుండడంతో బంగారుమెట్ట నుంచి రాజాం కూడలి వరకు పలుచోట్ల రోడ్డు బీటలు వారి, తీవ్రంగా దెబ్బతిన్నది. ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, గ్రానైట్ రాళ్లను రవాణా చేసే భారీ వాహనాలు ఈ మార్గంలో వెళ్లకుండా చూడాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



కలెక్టర్ విజయకృష్ణన్‌కు చెక్కు అందజేస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, ఇతర అధికారులు

సింహాద్రి ఎన్టీపీసీ 'సామాజిక బాధ్యత'

అనకాపల్లి ఇండోర్ స్టేడియం అభివృద్ధికి రూ.కోటి సాయం

- జిల్లా కలెక్టర్‌కు చెక్కు అందించిన సీజీఎం సంజయ్‌కుమార్‌సిన్హా

పరవాడ, సెప్టెంబరు 17: సామాజిక బాధ్యతలో భాగంగా సింహాద్రి ఎన్టీపీసీ అధికారులు, అనకాపల్లి ఇండోర్ స్టేడియం అభివృద్ధికి రూ.కోటి ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు చెక్కును మంగళవారం అనకాపల్లిలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్‌సిన్హా అందజేశారు. స్టేడియం అభివృద్ధికి ఆర్థికంగా సహకరిస్తున్న ఎన్టీపీసీ అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి హెచ్‌ఆర్ విభాగం డీజీఎం అనిత్‌కుమార్, సీఎస్‌ఆర్ హెచ్‌ఆర్ విభాగం కె.ప్రకాశరావు పాల్గొన్నారు.

క్రైం... crime news

శారదా నదిలో గల్లంతైన వ్యక్తి మృతి



బద్ది బాబూరావు (ఫైల్ ఫొటో)

రాంబిల్లి, సెప్టెంబరు 17: మండలంలోని వైలోవ వద్ద శారదా నదిలో ప్రమాదవశాత్తూ మునిగిపోయి గల్లంతైన వ్యక్తి శవమై తేలాడు. ఇతని మృతదేహం మంగళవారం కొప్పుగొండుపాలెం వద్ద నేవీ వంతెన సమీపంలో లభ్యమైందని సీఐ నరసింగరావు తెలిపారు. వైలోవ గ్రామానికి చెందిన బద్ది బాబూరావు(58) ఈ నెల 15వ తేదీ ఉదయం 7:30 గంటల ప్రాంతంలో శారదా నదికి అవతల వైపున ఉన్న పొలానికి వెళ్లేందుకు నీటిలో నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ సమయంలో నదిలో నీటి ఉధృతి అధికంగా వుండడంతో ప్రమాదశావత్తూ మునిగిపోయి గల్లంతయ్యాడు. పొలానికని వెళ్లిన వ్యక్తి ఎంతసేపైనా ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నదిలో గాలింపు చర్యలు చేపట్టగా కొప్పుగొండుపాలెం సమీపంలోని నేవీ వంతెన వద్ద బాబూరావు మృతదేహం కనిపించింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు. తహసీల్దార్ పి.భాగ్యవతి వైలోవ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబీకులను వివరాలు అడిగి, పరామర్శించారు.

గంజాయి కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

» రూ.2 లక్షలు జరిమానా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: గంజాయి రవాణా కేసులో ముద్దాయికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం పదో అదనపు జిల్లా జడ్జి నందనవనం శ్రీవిద్య తీర్పు చెప్పారని జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. 2021 సెప్టెంబరు మూడో తేదీన అనకాపల్లి పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు జాతీయ రహదారిలో ఒక కార్ల షోరూమ్ పక్కన నిలిపి వుంచిన జీపును తనిఖీ చేయగా 620 కిలోల గంజాయి లభ్యమైందన్నారు. అప్పటి ఎస్ఐ బి.సతీశ్ గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని, అదే ఏడాది అక్టోబరు 23వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు గ్రామానికి చెందిన కిల్లో కృష్ణారావును నిందితుడిగా గుర్తించి అప్పటి సీఐ ఎల్.భాస్కరరావు అరెస్టు చేశారని చెప్పారు. కేసు దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేశారన్నారు. వీటిని పరిశీలించిన పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య, గంజాయి రవాణా కేసులో కిల్లో కృష్ణారావును ముద్దాయిగా నిర్ధారిస్తూ 20 ఏళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.2 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ వడ్డాది వెంకటరావు కేసును వాదించారు.

ఇసుకతో రెండు ట్రాక్టర్లు, ఒక లారీ సీజ్

నక్కపల్లి, సెప్టెంబరు 17: మండలంలోని డీఎల్‌పురం సమీపంలో మంగళవారం ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను, ఉపమాక హైవే జంక్షన్ వద్ద ఒక లారీని పట్టుకుని జరిమానా విధించినట్టు సీఐ కుమారస్వామి చెప్పారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని, సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలు కూడా జరగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

» కలెక్టర్ విజయకృష్ణన్

» 'స్వచ్ఛత హి సేవా' పక్షోత్సవాలు ప్రారంభం



తుమ్మపాలలో చీపుర్లు పట్టి రోడ్డుపై ఊడుస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: స్వచ్ఛత హి 'సేవా' స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. 'స్వచ్ఛత హి సేవా-2024' పక్షోత్సవాల ప్రారంభం సందర్భంగా తుమ్మపాల పంచాయతీలో మంగళవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణపాటు అధికారులు, విద్యార్థులు, పారిశుధ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు ప్రతి రోజు ఒక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా వుంటే ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందని చెప్పారు. డ్రైనేజీ కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి ద్వారా పలురకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పరిశుభ్రమైన మంచినీటిని తాగాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని, శానిటేషన్ కిట్స్ అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని, దీనివల్ల పచ్చదనం పెరుగుతుందని చెప్పారు.ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలు చీపుర్లు చేతపట్టి కొద్దిసేపు రోడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో శిరీషారాణి, డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి తమలపాకు రైతుల సమస్యలు

» ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్



తమలపాకు రైతులతో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 17: తమలపాకుల రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ అన్నారు. మండలంలోని సత్యవరంలో మంగళవారం తమలపాకుల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు తమలపాకు రైతులందరూ సంఘంగా ఏర్పడాలని సూచించారు. ఉపాధి హామీ పథకాన్ని తమలపాకు తోటలకు అనుసంధానం చేయాలని, తద్వారా రైతులకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. మిగతా పంటల మాదిరి తమలపాకు తోటలకు కూడా బీమా సదుపాయం కల్పించాలని, తమలపాకులను కోసిన తరువాత గ్రేడింగ్ చేసుకునేందుకు షెడ్లు నిర్మించాలని, అవసరం మేరకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జాతీయ సమితి సభ్యుడు రావు గ్గారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల మాతినాయుడు, వీసీబీ డైరెక్టర్ డాక్టర్ చెలికాని కృష్ణమోహనరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో అనకాపల్లికి టీమ్ చాంపియన్‌షిప్



పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్లు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో 14 నుంచి 16వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ పోటీల్లో అనకాపల్లి క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సొంతం చేసుకోవడమే కాకుండా టీమ్ చాంపియన్‌షిప్ రన్నర్స్‌ను కైవసం చేసుకున్నారు. వివిధ కేటగిరీల్లో నాగరాజు, పి.దినేశ్, లవకుమార్, బాలసాయి చరణ్, ధరనేశ్, కేవీవీఎస్ ప్రసాద్, ఎం.శ్రీనివాస్, అందే గణేశ్, రాణా, శ్రీను, సంతోష్ బంగారు పతకాలు; ప్రితేష్, బీవీ రామకృష్ణ, ప్రవల్లిక, పవన్‌కుమార్, లోకేశ్, రజత పతకాలు, ఇ.గణేశ్‌నాయుడు, ప్రవీణ్, తులసీరావు కాంస్య పతకాలు సాధించారు. వీరిని అనకాపల్లి జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ కాండ్రేగుల శ్రీరామ్, గౌరవాధ్యక్షుడు అప్పలనాయుడు, అధ్యక్షురాలు లీలా, ప్రధాన కార్యదర్శి బద్రినాథ్ అభినందించారు.

పీఎంఏవై లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అప్పగింత

అనకాపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాజధాని భువనేశ్వర్ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0' మార్గదర్శకాలను వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా అనకాపల్లి కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్‌విజయకృష్ణన్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు వీక్షించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేశారు.



లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే బండారు, తదితరులు

ఏపీపీటీఏ జిల్లా నూతన కార్యవర్గం



ఏపీపీటీఏ నూతన కార్యవర్గ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఏపీపీటీఏ) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం స్థానిక ఉడ్‌పేట ప్రైమరీ స్కూల్‌లో జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా బోయిన చిన్నారావు, ప్రధాన కార్యదర్శిగా జి.షణ్ముఖరావు, ఆర్థిక కార్యదర్శిగా చెల్లా నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గణపతిరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 117 జీవోను రద్దు చేసి మూడు, నాలుగు, ఐదు తరగతులను తిరిగి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కలపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, సరోజిని, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరం ప్రారంభం



సదరం శిబిరానికి హాజరైన దివ్యాంగులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం సబ్బవరం, కె.కోటపాడు మండలాలకు చెందిన దివ్యాంగులకు సదరం క్యాంప్ నిర్వహించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ ధ్రువీకరణ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ శిబిరానికి 74 మంది దివ్యాంగులు హాజరయ్యారని, వీరిలో 44 మందిని అర్హులుగా గుర్తించామని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. 40 మంది ఆర్థోపెడిక్ సమస్యకు సంబంధించిన వారు, ముగ్గురు రక్త సంబంధ సమస్య, ఒకరు కిడ్నీ బాధితుడు ఉన్నారన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 17: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగులు సీట్లభర్తీకి నాలుగో విడత ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక ఐటీఐ కేంద్రం ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26లోగా ఆన్‌లైన్ అప్లికేషన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. 27న సాయంత్రం 3 గంటలు వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తామని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న వారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 పాస్‌పోర్టు ఫొటోలతో 28న ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థులు ఫోన్ నెంబరు, ఈ-మెయిల్ ఐడీ మార్చ కూడదని పేర్కొన్నారు, అభ్యర్థుల ఆధార్ వివరాలు, ఎస్సెస్సీ సర్టిఫికెట్ వివరాలు సరిపోవాలని సూచించారు. ఈ వివరాలకు ఫోన్ : 87907 41378, 89772 72231, 7013737243లో సంప్రదించాలని కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో ఏపీ టాప్‌లో నిలవాలి

» అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

మాడుగుల, సెప్టెంబరు 17: బీజేపీ సభ్యత్వ నమోదులో ఆంధ్రప్రదేశ్ ఒకటో స్థానంలో నిలవాలని, ఇందుకు ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త తన వంతు కృషి చేయాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను మాడుగులలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రమేశ్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రి వెనుక భాగంలో నిర్మాణంలో ఉన్న అదనపు భవనాన్ని పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. తదుపరి మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకొన్నారు. పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భవిష్యత్తులో ప్రతి గ్రామానా బీజేపీ పటిష్ఠం కావాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన నియోజకవర్గంలోని పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు, బీజేపీ నాయకులు మేరపురెడ్డి శ్రీనివాసరావు, గంగయ్య, సంతోషసుబ్బలక్ష్మిలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ, టీడీపీ టౌన్‌పార్టీ అధ్యక్షులు రంజిత్‌వర్మ, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, దంగేటి సూర్యారావు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు

మాడుగుల ఏపీయూడబ్ల్యూజే మాడుగుల ప్రెస్‌క్లబ్ భవన పునఃనిర్మాణానికి రూ.5 లక్షలు ఎంపీ నిధులు మంజూరు చేయనున్నట్టు ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. మాడుగుల వచ్చిన ఆయనను మాడుగుల యూనియన్ ప్రతినిధులు కలిసి భవనం విషయమై వినతిపత్రం అందజేయగా, దీంతో రూ.5 లక్షలు నిధులు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, డీఈవో

» కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. స్థానిక గాంధీనగరంలోని జీవీఎంసీ హైస్కూల్‌ను మంగళవారం డీఈవో వెంకటలక్ష్మమ్మతో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని చెప్పారు. అనంతరం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను వేయించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. చిన్నపిల్లలు, గర్భిణిలు ఎంతమంది ఉన్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఏర్పాటు



దివ్యాంగుల జేఏసీ నూతన కార్యవర్గం

చోడవరం, సెప్టెంబరు 17 : జిల్లాలో దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోరుతూ పోరాటం చేసేందుకు ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేసినట్టు జిల్లా జిల్లా దివ్యాంగుల సంఘం వ్యవస్థాపకులు దుగ్గిరాల రవికుమార్ ప్రకటించారు. మంగళవారం పట్టణంలో జిల్లాలోని దివ్యాంగ ఉద్యోగులు, నిరుద్యోగులతో సమావేశాన్ని నిర్వహించి జేఏసీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ జేఏసీ చైర్మన్‌గా ఎ.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా డీఎస్ ప్రసాద్, గౌరవ సలహాదారుగా పీఎస్టీ పట్నాయక్, అధ్యక్షునిగా వీరుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా వి.చంద్రశేఖర్, కోశాధికారిగా అర్జునరావు, ఉపాధ్యక్షునిగా గడిరెడ్డి రాము, సంయుక్త కార్యదర్శులుగా అప్పలనాయుడు, సురేష్ నియమితులయ్యారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో హెలెన్ కెల్లర్, లూయిస్ బ్రెయిలీ, స్టీఫెన్‌హాకింగ్‌ల విగ్రహాలు నెలకొల్పాలని తీర్మానించారు.

'మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం'

రాంబిల్లి, సెప్టెంబరు 17: మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని మత్స్యకార సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మిడి మహేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన మత్స్యకార సంక్షేమ సేవా సమితి మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 21న వాడనర్సాపురంలో తీరప్రాంత పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఎంఎంఎస్ ప్రధాన కార్యదర్శి పెరుమళ్ల వాసు మాట్లాడుతూ మత్స్యకారులంతా ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు చింతకాయల ఎర్రయ్య, ఎరిపల్లి చిట్టిబాబు, ఎంఎంఎస్ మండల అధ్యక్షుడు సూరాడ వెంకన్న, ప్రధాన కార్యదర్శి బాలపరమేశ్వరరావు, నాయకులు సూరాడ నూకరాజు, చెల్లారి కొండబాబు, చేపల చిట్టిబాబు, ఎరిపల్లి అప్పలరాజు, సూరాడ దానయ్య పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

భారీ వృక్షాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు

» అధికారులకు ఎమ్మెల్యే సుందరపు ఆదేశాలు



నరికివేసిన భారీ వృక్షాన్ని పరిశీలించిన అనంతరం పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 17: పట్టణానికి సమీపంలోని వాటర్ సంపు వద్ద ప్రధాన రహదారి పక్కన ఆదివారం రాత్రియంత్రాలతో భారీ వృక్షాన్ని కూల్చివేసిన సంఘటనచర్చనీయాంశంగా మారింది. ఎస్.రాయవరం మండలానికి చెందిన రియల్ వ్యాపారి తన స్థలానికి అడ్డుగా ఉందన్న నెపంతో భారీ వృక్షాన్ని తొలగించినట్టు స్థానికులు చెబుతున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వార్త రావడంతో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ స్పందించారు. నరికివేతకు గురైన చెట్టును సీఐ ధనుంజయరావు, ఆర్‌అండ్‌బీ డీఈ విద్యాసాగర్‌లతో కలిసి పరిశీలించారు. భారీ వృక్షం నరికివేయించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఏలేరు కాలువ గండి పూడ్చివేత

» యథావిధిగా విశాఖపట్నంకు నీటి సరఫరా



ఏలేరు కాలువ గండి పూడ్చిన దృశ్యం

మాకవరపాలెం, సెప్టెంబరు 17: ఏలేరు కాలువ గండి పూడ్చివేత్త పనులు ఎట్టకేలకు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం మాకవరపాలెం మండలం రాచపల్లి 99.6 కూడలి వద్ద ఏలేరు కాలువకు గండి పడిన విషయం తెలిసిందే. దీంతో జీఎంసీ అధికారులు పనులు ప్రారంభించినప్పటికీ ఎగువ ప్రాంతం నుంచి అధికంగా నీరు రావడంతో పాటు గండిపడిన చోట బాగా లోతట్టు ప్రాంతం కావడంతో నీటి ఉధృతికి సోమవారం వేసిన గండి మళ్లీ కొట్టుకుపోయింది. దీంతో తిరిగి మళ్లీ పనులు మొదలు పెట్టి మంగళవారం ఉదయం నాటికి పూర్తి చేశారు. దీంతో విశాఖట్నానికి ఏలేరు కాలువ నీరు యథావిధిగా సరఫరా సాధ్యమైంది.

అయితే విశాఖపట్నంలోని కంపెనీలతో పాటు తాగునీటి అవసరాలకు 200 క్యూసెక్కుల నీరు అవసరమని, కానీ సుమారు 80 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా అవుతుందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో కాలువకు గండి పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు జీఎంసీ అధికారులు పేర్కొన్నారు.

ఆస్పత్రుల కాంట్రాక్ట్ సిబ్బంది సమ్మె బాట

» డీఆర్వో, డీసీహెచ్ఎస్‌లకు నోటీసులు



డీఆర్‌వో దయానిధికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కొత్తూరు, సెప్టెంబరు 17: వైద్య విధాన పరిషత్ పరిధిలో జిల్లాలో ఉన్న ఎనిమిది ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, సూపర్‌వైజింగ్ కార్మికులు మంగళవారం జిల్లా అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ, తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో సమ్మె చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కోస్‌లో కలపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలను ఈ నెల 29లోగా పరిష్కారించకపోతే 30వ తేదీ నుంచి విధులు బహిష్కరించి సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. అనంతరం డీఆర్వో దయానిధి, డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు, జిల్లా కార్మిక శాఖ అధికారి వసంతరావులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నూకరాజు, వరప్రసాద్, సంతోష్, పెదపూడి సత్యవతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి సాయం



హోంగార్డు భార్యకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: స్టీల్ ప్లాంట్‌లో డిప్యూటేషన్‌పై హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన పైలా అప్పలనాయుడు కుటుంబానికి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ దీపిక ఆర్థిక సాయం అందజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్సు మొత్తం రూ.4,15,515 చెక్కును హోంగార్డు భార్య కుమారికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎం.దేవప్రసాద్, కార్యాలయ ఏవో బి.శారద, తదితరులు పాల్గొన్నారు.

జనవాణికి వినతుల వెల్లువ

నక్కపల్లి, సెప్టెంబరు 17: జనసేన పార్టీ నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ చెప్పారు. నక్కపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పలు ప్రాంతాల ప్రజల నుంచి వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో మండలంలో నెల రోజులపాటు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. కొన్ని సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పిక్కిస్వామి, పాము గణేశ్, చంద్రరావు, రంగనాధ్, జగన్,సతీశ్, మహేశ్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో ప్రవేశాలు ప్రారంభం

- తొలి ప్రవేశం పొందిన డి.లక్ష్మీలావణ్య
- తొలి రోజు ఆరుగురికి అడ్మిషన్లు


తొలి ఎంబీబీఎస్ సీటు పొందుతున్న డి.లక్ష్మీలావణ్య

పాడేరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ప్రవేశాలను మంగళవారం ప్రారంభించారు. తొలి రోజు ఆరుగురు విద్యార్థులు ఎంబీబీఎస్‌లో చేరారు. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన డి.లక్ష్మీలావణ్య తొలి ప్రవేశాన్ని పొందారు. అలాగే జి.భాగ్యభారతి, ఆర్యన్‌మిశ్రా, నిత్యరామలక్ష్మి, మణిదీప్, దీవెనలు ప్రవేశం పొందారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హేమలత వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థుల విద్యార్హత, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించి వారికి ప్రవేశ పత్రాలను అందించారు. గిరిజన ప్రాంతంలో ఏర్పాటైన మెడికల్ కాలేజీలో తొలి బ్యాచ్‌గా తాము ప్రవేశం పొందడం ఆనందంగా ఉందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. తొలి రోజు ఆరుగురు విద్యార్థులు చేరాలని, గడువు నాటికి తొలి విడత 20 సీట్లు భర్తీ కానున్నాయని ప్రిన్సిపాల్ హేమలత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ఫ్యాకల్టీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు లుపిన్ రూ.2 లక్షలు విరాళం


శివశంకర్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న లుపిన్ హెచ్‌ఆర్ విభాగం డీజీఎం ఎన్. శ్రీనివాసరావు

పరవాడ, సెప్టెంబరు 17 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.2లక్షల చెక్కును మంగళవారం ఫ్యాక్టరీస్ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకర్‌రెడ్డికి లుపిన్ హెచ్‌ఆర్ విభాగం డీజీఎం శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ జెవీవీఎస్ నారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పి.చిన్నారావు, లుపిన్ ఫార్మా ప్రతినిధులు ఎస్.అప్పారావు, కేదార మల్ల, డి.వెంకటనారాయణ పాల్గొన్నారు.

సీబీఎస్ఈ అథ్లెటిక్స్ పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న సీహెచ్‌వీకే.నరసింహారావు

పాయకరావుపేట, సెప్టెంబరు 17 : సీబీఎస్ఈ నిర్వహించిన క్లస్టర్-7 అథ్లెటిక్స్ పోటీల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు మొదటి స్థానం సాధించడంతోపాటు త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం విద్యాసంస్థల యాజమాన్యం అందజేసిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు సీబీఎస్ఈ బోర్డు క్లస్టర్-7 అథ్లెటిక్స్ పోటీల్లో 4,400 మీటర్ల రిలే అండర్-19 విభాగంలో తమ విద్యార్థులు వై.జయసత్యకుమార్, ఎల్.పూర్ణశ్యామ్‌నాయుడు, శాశ్వత్ ప్రేమ్, ఎండీ.సునీల్‌కుమార్ అద్భుత ప్రతిభ కనబర్చి మొదటి స్థానం సాధించారన్నారు. అదేవిధంగా జావెలన్ త్రో విభాగంలో ఆదిత్యకుమార్ 40, 90 మీటర్లలో ప్రథమ స్థానం సాధించడంతోపాటు వీరంతా వచ్చే నెల 6 నుంచి 8వ తేదీ వరకు వారణాసిలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా 5వేల మీటర్ల రన్నింగ్ పోటీలో తమ విద్యార్థి ఎండీ.సునీల్‌కుమార్ కాంస్య పతకాన్ని సాధించాడని తెలిపారు. కాగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అభినందించారు. ఉపాధ్యాయులు, కోచ్ శ్రీరామాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు


రాంబిల్లి: మూలజంపలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న లోకనాథం, ప్రభావతి, కోటేశ్వరరావు

ఎలమంచిలి, సెప్టెంబరు 17: స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పార్టీ నేతలు పిట్లా దాసుబాబు, పప్పు ఈశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు కేక్ కట్ చేసి, అందరికీ పంచారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు నక్కా శివశంకర్, బి.శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బీజేపీ పట్టణ కన్వీనర్ ఎస్.రమేష్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు వి.వెంకటేశ్వరరావు, కువల కుమార్ తదితరులు నరేంద్ర మోదీ బర్త్ డే కేక్‌ని కట్‌చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో గొర్రె మోసేరాజు, పిల్లి రాంబాబు, ఎం.సూరిబాబు, కె.రంగయ్య, పి.నానాజీ, డీవీ.సత్యనారాయణ, ఎం.జగన్నాథం, కె.మూలాస్వామి, ఎం.నరసింహమూర్తి, గడ్డం వెంకటేశ్వరరావు, ఎం.జగదీశ్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎలమంచిలి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు కేక్ కట్ చేసి, అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో కూండ్రపు నాయుడు బాబు, రాజాన రాజు, మేరుగు కాసుబాబు, కొరుప్రోలు చిన్నారావు, చుక్క అనూరాధ, ఇబ్రహిం బాషా, యండపల్లి రాజు, దొడ్డి అప్పారావు, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో.. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా గ్రామంలో ఎల్‌వీ.ప్రసాద్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీ సీఎం రమేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కేతినేని సురేంద్రమోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈర్లె శ్రీరామమూర్తి, కూటమి నేతలు పల్లెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17 : స్థానిక గాంధీనగరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేరు మీద మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. బీజేపీ అనకాపల్లి మండల శాఖ అధ్యక్షుడు నరసింగ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వి. రమేష్, ఓరుగంటి నాగమణి, రామకృష్ణ, ఏఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ స్వచ్ఛతతో ఆరోగ్యం

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్


కొత్తూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్


ఎలమంచిలిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

కొత్తూరు, సెప్టెంబరు 17 : సంపూర్ణ స్వచ్ఛతతోనే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం అనకాపల్లి మండలం కుంచంగిలో జరిగిన స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను అక్టోబర్ 1లోగా శ్రమదానంతో శుభ్రం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలను శుభ్రం చేసిన వారందరికీ అవార్డులు, సఫాయిమిత్రులను సన్మానం చేయనున్నట్టు చెప్పారు. క్వారీల ప్రతినిధులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, గ్రామంలో తగిన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎలమంచిలిలో.. స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ శ్రమించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మునిసిపాలిటీ కార్యాలయం వద్ద స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ మునిసిపాలిటీలో ప్రజలంతా తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి కార్మికులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ కె. విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీను, టీపీవో శ్రీలక్ష్మి, కూటమి నేతలు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, లవుడు లోవరాజు, కొఠారు నరేష్, గుర్రాల శేఖర్, ఊడి బాబులు, ఝాన్సీ, రాజాన నారాయణమ్మ, కొఠారు శ్రీను తదితర నేతలు పాల్గొన్నారు.

పరవాడలో.. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 15 రోజులుపాటు పరిశుభ్రత కార్యక్రమాలను చేపడతామన్నారు. అనంతరం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. తర్వాత విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమసుందరరావు, పంచాయతీ విస్తరణ అధికారి కె. రమేష్‌నాయుడు, కార్యదర్శి అచ్యుతరావు, వెలుగు ఏపీఎం కనకమ్మ, పాఠశాల హెచ్‌ఎం అప్పలనాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్‌లో.. స్థానిక పీటీడీ అనకాపల్లి డిపో కార్మికులకు స్వచ్ఛత హి సేవా పక్షోత్సవాలపై డీపీటీవో పద్మావతి మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం రవిచంద్ర పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.సాంబశివరావు, ఎంఈఓ కేవీఎన్.గాంధీ, పంచాయతీ ఈఓ వర్మ, పంచాయతీ కార్యదర్శి వైవీ.సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. మండలంలోని దిమిలి భాగవతులు సోమన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీటీ కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వీహెచ్‌సీ సిబ్బంది, గ్రామ నాయకులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ బంగారు చిలుకు, మాజీ సర్పంచులు కోటాపు వడ్డీకాసులు, శానాపతి నాగేశ్వరరావు, బీసీటీ పశుపోషణ శాస్త్రవేత్త విజయ రాగ్ని పాల్గొన్నారు.


అనకాపల్లి టౌన్: ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడుతున్న పద్మావతి


ఎమ్మెల్యే కొణతాలను సత్కరించిన బంగారం వర్తకులు

గణనాథున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: పట్టణంలోని చిననాలుగురోడ్ల జంక్షన్‌లో అనకాపల్లి గోల్డ్ మర్చంట్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథున్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంగళవారం దర్శించుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్నసమారాధనను పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం. వెంకటనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొణతాల రాజేంద్ర, తలారి లక్ష్మీప్రసాద్, బుద్ద శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు పాల్గొన్నారు. అదేవిధంగా పూడిమడకరోడ్డు బైపాస్ జంక్షన్‌లో సిద్ధి వినాయక ముఠా వర్కర్స్ సంఘం, గూడ్స్ ఆటో సంఘం, పాసింజర్ ఆటో సంఘం ప్రతినిధులు ఏర్పాటుచేసిన గణనాథున్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దర్శించుకున్నారు.

జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో పనిచేస్తున్న క్లాప్ లోడర్స్‌కు బకాయిపడిన వేతనాలు వెంటనే చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. జోనల్ కార్యాలయం గేటు వద్ద మంగళవారం వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు పనులను నిలుపుదల చేసి ఆందోళన చేస్తున్నారన్నారు. తక్షణమే వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జోన్ అధ్యక్షుడు వై.వరప్రసాద్, ఎస్.భారతి, పోలరావు పాల్గొన్నారు.


జోనల్ కార్యాలయం గేటు వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

ప్రజల అవసరాలను విస్మరించిన వైసీపీ నేతలు

- బస్టాండ్ వద్ద దిమ్మ సమస్య పరిష్కరిస్తాం
- ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్


అచ్యుతాపురం: విద్యార్థినులకు నులిపురుగు మందులు పంపిణీ చేస్తున్న విజయకుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 17: నియోజకవర్గంలో వైసీపీ నేతలు ప్రజల అవసరాలను విస్మరించారని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ విమర్శించారు. మంగళవారం స్థానిక బస్టాండ్ వద్ద వైఎస్ విగ్రహం వద్ద దిమ్మను పరిశీలించారు. ఎలమంచిలిలో 15 ఏళ్లుగా ఎక్స్‌ప్రెస్ బస్సులు రాకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ సమస్యను పరిష్కరించామన్నారు. బస్సులు వచ్చేందుకు విగ్రహం వద్ద ఉన్న దిమ్మ ఆటంకంగా ఉందని, పూర్తి స్థాయిలో తొలగించకుండా వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారని విజయకుమార్ ఆరోపించారు. ఈ దిమ్మ ప్రజలకు అసౌకర్యంగా ఉన్నా.. వైసీపీ నేతలకు కనీసం జాలి, దయ లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. అసౌకర్యంగా ఉండే దిమ్మను తొలగించి తీరతామన్నారు. ఇందుకు సహకరిస్తే ప్రజల మధ్యన ఉంటారని, లేకుంటే వారి నాయకుల్లాగా కనుమరుగైపోతారన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, అన్నం బాబూజీ, కొఠారు నరేష్, రాజాన నారాయణమ్మ, లాలం సోమునాయుడు, గుర్రాల శేఖర్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. అచ్యుతాపురం జంక్షన్‌లో మంగళవారం జరిగిన స్వచ్ఛతా హి సేవా పక్షోత్సవాల్లో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి పరిశుభ్రతపై నినాదాలు చేశారు. అనంతరం అచ్యుతాపురం హైస్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, డ్రీమ్స్ నాయుడు, పీలా సందీప్, పల్లి శేషగిరి రావు, కూనిశెట్టి రమణ, పవన్ విజయ్, కూండ్రపు వెంకునాయుడు పాల్గొన్నారు.

ఎలమంచిలి చేరుకున్న సీపీఎం రక్షణ యాత్ర


ఎలమంచిలి చేరుకున్న సీపీఎం రక్షణ యాత్ర ర్యాలీ

ఎలమంచిలి, సెప్టెంబరు 17 : పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు సీపీఎం తలపెట్టిన రక్షణ యాత్ర మంగళవారం ఎలమంచిలి చేరుకుంది. ఈ ర్యాలీకి సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్, శివాజీ, ఎస్ఎఫ్ఐ ప్రతినిధి మణికంఠ, కార్మిక నేత కర్రి అప్పారావు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ సెజ్‌లోని పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో నియోజకవర్గ ప్రజలు అనారోగ్య ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కనీస భద్రత లేకుండా పోయిందని, ఏ పరిశ్రమలో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోననే ఆందోళనతో ప్రజలు జీవించాల్సి వస్తుందన్నారు.

రాంబిల్లిలో.. ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతకు పాయకరావుపేటలో ప్రారంభమైన సీపీఎం రక్షణ యాత్ర మంగళవారంకొత్తూరు మీదుగా మూలజంప గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా మూలజంపలో సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు అధ్యక్షతన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రభావతి, జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫార్మా కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యాలు మెరుగైన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, నూకన్న, శివాజీ, అప్పారావు, వెంకునాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

భారీ వృక్షం తొలగింపుపై ఫిర్యాదు

పాయకరావుపేట, సెప్టెంబరు 17 : స్థానిక లింగాలతోట కాలనీలో అనుమతుల్లేకుండా భారీ వృక్షాన్ని తొలగించడంపై పంచాయతీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈఓ వర్మ మాట్లాడుతూ లింగాలతోటకాలనీ 5వ లైనులో భారీ నేరుడు చెట్టును అనుమతుల్లేకుండా తొలగించారని ఫిర్యాదు అందడంతో వెంటనే వెళ్లి తొలగించిన చెట్టు దుంగలను కొంతమంది వ్యక్తులు తరలిస్తుండగా పట్టుకుని పంచాయతీ కార్యాలయానికి తరలించామన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

కనకదుర్గమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా భీమరశెట్టి



అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17 : స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా భీమరశెట్టి వరహా నూకరాజు నియమితులయ్యారని ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ తెలిపారు. ధర్మకర్తలుగా విల్లూరి మాధవ, పిళ్లా తారకేష్, పొలమరశెట్టి యుగంధర్, కర్రి కల్యాణ్, కాండ్రేగుల సాంబశివ, దాడి త్రినాథ్, భీశెట్టి ప్రసన్న, మళ్ల రాజు, దాడి కిరణ్‌లు నియమితులయ్యారన్నారు. ఈనెల 20న నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయనుందన్నారు.

తగరంపూడిలో పశువైద్య శిబిరం

కొత్తూరు, సెప్టెంబరు 17 : మండలంలోని తగరంపూడిలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో 26 ఆవులకు, 38 గేదెలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, ఖనిజ లవణ మిశ్రమాలు అందజేశారు. ఈ శిబిరంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.ప్రసాదరావు, పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ రామ్మోహనరావు, ఏడీ డాక్టర్ బి.సౌజన్య, పశువైద్యాధికారి బి. రామారావు, సీహెచ్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం బైక్ యాత్ర గోడపత్రిక ఆవిష్కరణ

పరవాడ, సెప్టెంబరు 17 : ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతపై సీపీఎం ఆధ్వర్యంలో పాయకరావుపేట నుంచి పరవాడ వరకు మోటార్ సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు వీవీ రమణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద బైక్ యాత్రకు సంబంధించిన గోడపత్రికను సీపీఎం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, సీపీఎం నాయకులు పి. మాణిక్యం, బంగార్రాజు, కె. సత్య తదితరులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాన్ని పెంచుకోవాలి

నక్కపల్లి, సెప్టెంబరు 17: విద్యా విధానంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా బోధనా నైపుణ్యతను పెంపొందించుకోవాలని ఎంఈవో కె.నరేశ్ సూచించారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠ్య ప్రణాళిక, బోధనోపకరణాలతో విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ రాణీలలిత, రిసోర్స్‌పర్సన్లు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ప్రభావతి పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు క్రీస్తు బోధనలు దోహదం

- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం/రూరల్, సెప్టెంబరు 17: ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచానికి శాంతి దోహదపడ్డాయని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక ఫిలడెల్ఫియా చర్చిలో జరిగిన సువార్త సంగీత కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగీతం మానసిక ఉల్లాసాన్ని ఇస్తుందన్నారు. అనంతరం విజయకుమార్‌ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అలుగు శ్యాంకుమార్, పీటర్, జాషువారాయ్, సుధీర్, జయరాజ్, తిమోతి నాయుడు, జయకుమార్, రాజేష్, సుజాత, జ్యోతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్లె ధర్మవరానికి తాగునీటి సౌకర్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అచ్యుతాపురం, సెప్టెంబరు 17: మండలంలోని గొర్లె ధర్మవరంతోపాటు వెదురువాడకు తాగునీటి సౌకర్యాన్ని పునరుద్ధరించారు. ఈనెల 15వ తేదీన 'కొళాయిల నుంచి బురద నీరు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గొర్లె ధర్మవరంలో చెడిపోయిన మోటారు స్థానే కొత్త మోటారు ఏర్పాటు చేసి కొళాయిల ద్వారా నీటిని సరఫరాచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొర్లె అశ్విని మాట్లాడుతూ.. తాము ఈనెల 13నే వాటర్ ట్యాంక్‌ని శుభ్రం చేయించామన్నారు. లీకులున్న వీధికొళాయిలకు మరమ్మతులు చేయించామన్నారు.

'రైతుల ఆర్థికాభివృద్ధే హెరిటేజ్ ధ్యేయం'

అచ్యుతాపురం, సెప్టెంబరు 17: పాడి రైతుల ఆర్థికాభివృద్ధే హెరిటేజ్ డెయిరీ ధ్యేయమని ఆ సంస్థ రీజనల్ మేనేజర్ పి.తులసి నాయుడు అన్నారు. మంగళవారం తిమ్మరాజుపేటలో పాడిరైతు నాగేశ్వరరావు ఆవు చనిపోయినందుకు రూ.30 వేలు బీమా చెక్కుని ఆయన అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా పాడి రైతులు ఆర్థికంగా స్థిరపరపడాలనే ధ్యేయంతోనే హెరిటేజ్ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ కూండ్రపు శేషు, శరగడం శివ బాపునాయుడు, జి.గోవింద్, రాము, ఎస్.నారాయణ మూర్తి పాల్గొన్నారు.

నేషనల్ యోగా పోటీల్లో రాంబాబు ఫస్ట్

నక్కపల్లి, సెప్టెంబరు 17: ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కర్ణాటకలోని బీకేఎస్ అయ్యంగార్ మెమోరియల్ ట్రస్ట్ గత నెలలో నిర్వహించిన నేషనల్ ఆన్‌లైన్ యోగా పోటీల్లో ఉపమాకకి చెందిన దవరసింగి రాంబాబుకు ప్రథమ స్థానం లభించిందని సంస్థ ప్రతినిధులు డి.పుట్టేగౌడ, డాక్టర్ బి.గీత, మహదేవ్, పి.సతీశ్ మంగళవారం ప్రకటించారు. గత ఏడాది కూడా రాంబాబుకు ప్రథమ స్థానం లభించడం విశేషం. ఇటీవల ఆయన కుమారులిద్దరికీ నేషనల్ ఆన్‌లైన్ యోగా పోటీల్లో ద్వితీయ స్థానం లభించింది. ఈయన మండలంలో ఎంతో మందికి యోగా, ధ్యానంలో శిక్షణ ఇస్తున్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17 : స్థానిక గాంధీనగరం అంజనేయస్వామి ఆలయంలో ప్రధాని నరేంద్ర మోదీ పేరు మీద మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. బీజేపీ అనకాపల్లి మండల శాఖ అధ్యక్షుడు నరసింగ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వి.రమేష్, ఓరుగంటి నాగమణి, రామకృష్ణ, ఏఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

ఎలమంచిలి, సెప్టెంబరు 17: మండలంలోని జంపపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన మూర్తి తన తండ్రి జ్ఞాపకార్థం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ మెటీరియల్‌ను హెచ్‌ఎం శాస్త్రి, ఉపాధ్యాయుడు బొడ్డేడ సత్యనారాయణ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రామకోటి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌కు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, సెప్టెంబరు 17 : అమలాపురంలో ఇటీవల జరిగిన 11వ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అభినందించారు. మంగళవారం అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో వారిని క్రీడాకారులు కలిశారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా కేకును కట్ చేసి, కూటమి నేతలకు పంపిణీ చేశారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17 : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారి ప్రతిష్ఠ జయంతి ఉత్సవాల్లో భాగంగా భాద్రపద మాసం పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహంతో నగర సంకీర్తన చేపట్టారు. రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో గోపూజ, ప్రదక్షిణాలు, త్రిమాతల పూజ, మూలమంత్రం హోమాలు నిర్వహించారు. ఆలయ మండపంలో అమ్మవారికి 81 కలశములతో స్నపనం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరుకొండ బుచ్చిరాజు, డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు బిళ్లపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


విశ్వకర్మ చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: స్థానిక నిదానందొడ్డి కామాక్షిదేవి ఆలయంలో విశ్వకర్మ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో విశ్వకర్మ విగ్రహానికి టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ పూజలు నిర్వహించారు. అలాగే విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగింపును అనకాపల్లి గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొణతాల రాజేంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తుర్తి గంగారావు, పట్టణ శాఖ అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు, కొమ్మోజి రాజు, పొన్నాడ వెంకట నరసింహ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. పట్టణంలో విశ్వకర్మ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్కు సెంటర్‌లో ఏపీ కార్పెంటర్స్ అసోసియేషన్ అమరావతి ప్రధాన కార్యదర్శి పెదపూడి నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్వకర్మ చిత్రపటానికి పలువురు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెదపూడి నరసింహమూర్తి, కొప్పోజు శ్రీను, కొత్తల శ్రీను, రామోజు నాగేశ్వరరావు, దివిలి నాగభూషణం, వరహాలబాబు, గానుగుల సత్యనారాయణ, సింహాద్రి నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని పలు గ్రామాల్లో విశ్వ బ్రాహ్మణులు మంగళవారం విశ్వకర్మ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో ఉన్న వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో ప్రవేశాలు ప్రారంభం

- తొలి అడ్మిషన్ పొందిన డి.లక్ష్మీలావణ్య
- తొలి రోజు ఆరుగురికి అడ్మిషన్లు


తొలి ఎంబీబీఎస్ సీటు (అడ్మిషన్ పత్రాన్ని) అందుకుంటున్న లక్ష్మీలావణ్య

పాడేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ప్రవేశాలను మంగళవారం ప్రారంభించారు. తొలి రోజు ఆరుగురు విద్యార్థులు ఎంబీబీఎస్‌లో చేరారు. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన డి.లక్ష్మీలావణ్య తొలి ప్రవేశాన్ని పొందారు. అలాగే జి.భాగ్యభారతి, ఆర్యన్‌మిశ్రా, నిత్యరామలక్ష్మి, మణిదీప్, దీవెనలు ప్రవేశం పొందారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హేమలత వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థుల విద్యార్హత, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించి వారికి ప్రవేశ పత్రాలను అందించారు. గిరిజన ప్రాంతంలో ఏర్పాటైన మెడికల్ కాలేజీలో తొలి బ్యాచ్‌గా తాము ప్రవేశం పొందడం ఆనందంగా ఉందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. తొలి రోజు ఆరుగురు విద్యార్థులు చేరాలని, గడువు నాటికి తొలి విడత 20 సీట్లు భర్తీ కానున్నాయని ప్రిన్సిపాల్ హేమలత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ఫ్యాకల్టీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు రాంబాబు మాస్టారు

- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, సెప్టెంబరు 17 : ఎందరో విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్ది మార్గదర్శకంగా నిలిచిన పీడీ గోతిరెడ్డి రాంబాబు మాస్టారు ఆదర్శప్రాయులని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కొనియాడారు. పట్టణానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీగా పనిచేసి పదవీ విరమణ చేసిన గోతిరెడ్డి రాంబాబుకు మంగళవారం కాలేజీ ఆవరణలో పదవీ విరమణ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే రాజుతో పాటు, మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు ఇతర ప్రముఖులు గోతిరెడ్డి రాంబాబు మాస్టారి సేవలను కొనియాడారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి సహకారం : ఎమ్మెల్యే రాజు


ఎమ్మెల్యే రాజుకు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

రావికమతం, సెప్టెంబరు 17 : విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మంగళవారం రావికమతం బీసీ కాలనీలో జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, విశాఖ డెయిరీ డైరెక్టరు గేదెల సత్యనారాయణ, సర్పంచ్ గంజి మంగమోదునాయుడు, ఎంపీటీసీలు గంజి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కృష్ణాదేవిపేటలో విశ్వకర్మకు పూజలు చేస్తున్న కార్పెంటర్లు

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద కార్పెంటర్స్ ఆధ్వర్యంలో శ్రీవిశ్వకర్మ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి, పూజలు చేశారు. అనంతరం గ్రామంలో విశ్వకర్మ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు.

స్వయంభూ విఘ్నేశ్వరుడి లడ్డూ రూ.20 వేలు


చోడవరంలో స్వయంభూ విఘ్నేశ్వరుడి లడ్డూతో సిమ్మునాయుడు తదితరులు

చోడవరం, సెప్టెంబరు 17 : పట్టణంలోని ప్రముఖ స్వయంభూ విఘ్నేశ్వరాలయం నవరాత్రి ముగింపు ఉత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి వినాయక లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో మండలంలోని అడ్డూరు గ్రామానికి చెందిన నాయకుడు శరగడం సిమ్ము నాయుడు రూ.20 వేలకు సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలో తునివలస శివారు వింటిపాలెంలో వినాయకుని వద్ద ఏర్పాటు చేసిన 11 కేజీల లడ్డూను మంగళవారం వేలం వేయగా, బాలగణపతి యూత్ రూ.5150లకు పాట పాడుకొని స్వాధీనం చేసుకున్నారు. భారీ స్థాయిలో అన్నసమారాధన, రాత్రికి నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కాకర కొండమ్మ, నానాజీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై టీడీపీ, వైసీపీ సభ్యుల వాగ్వాదం

- తమను అధికారిక కార్యక్రమాలకు పిలవడం లేదంటూ వైసీపీ ఎంపీటీసీల ఆరోపణ
- అధికారంలో ఉన్నప్పుడు మీరే చేసేంది అదే కదా అంటూ 'దేశం' సభ్యుల ఎదురుదాడి


ప్రొటోకాల్‌పై వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాదోపవాదాలు

గొలుగొండ, సెప్టెంబరు 17 : వివిధ రకాలైన సంక్షేమ పథకాల అమలులో ప్రొటోకాల్ అంశమై మంగళవారం ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యులు వాగ్వాదానికి దిగారు. తొలుత దీనిపై వైసీపీ సభ్యులు నిలదీశారు. వారికి ధీటుగా టీడీపీ ఎంపీటీసీలు సమాధానం ఇచ్చారు. ఇప్పుడు ప్రొటోకాల్ గురించి అడుగుతున్న వైసీపీ నేతలకు వారు అధికారంలో ఉన్నప్పుడు మాత్రం ఆ విషయం గుర్తుకు రాలేదెందుకో? అంటూ ఏఎల్ పురం ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ వైసీపీ నేతలను ఎద్దేవా చేశారు. ఆ రోజు ప్రొటోకాల్ ఉల్లంఘించింది మీరే కదా అంటూ విమర్శించారు. దీంతో ఇరు పార్టీల సభ్యుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.

ఈ నేపథ్యంలో ఎంపీపీ మణికుమారి, జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, అధికారులు తప్పకుండా ప్రొటోకాల్‌ను పాటించాలని కోరారు.

అనంతరం శాఖల వారీగా గత మూడు నెలల నుంచి చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి అధికారులు వివరించారు. ఏఎల్ పురంలో గత ప్రభుత్వంలో సెంటున్నర హౌసింగ్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తే లబ్ధిదారులు రెండు సెంట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని, దీనిపై విచారణ చేపట్టాలని ఏఎల్ పురం ఎంపీటీసీ డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇసుక లేకపోవడతో వివిధ రకాలైన అభివృద్ధి పనులు నిలిచిపోయాయని భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేకుండా పోయాయని చోద్యం ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణ పేర్కొన్నారు. నాటుబండ్లతో వంతెన వద్ద ఇసుక రవాణా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. వడపర్తి నుంచి కొత్తఎల్లవరం, గుండుపాల మీదుగా నర్సీపట్నానికి బడిబస్సు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే గ్రామస్థాయి పాలకవర్గాలు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డేవిడ్‌రాజ్, పలు మండల శాఖాధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పలు చోట్ల స్వచ్ఛతా ర్యాలీలు


బుచ్చెయ్యపేటలో మానవహారం


నాతవరంలో సమావేశం


మాకవరపాలెంలో ర్యాలీ


మొక్కలు నాటుతున్న నేతలు, అధికారులు

నర్సీపట్నం, సెప్టెంబరు 17 : పురపాలక సంఘంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. మంగళవారం పాత మునిసిపల్ ఆఫీసు నుంచి అబీద్ సెంటర్ వరకు ర్యాలీగా వచ్చారు. తడి, పొడి చెత్త అందించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మొక్కలు నాటి సంరక్షణ చేయాలని నినాదాలు చేశారు. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, మేనేజనర్ శంకరరావు, పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్ : మండలంలోని తొమ్మిది పంచాయతీలలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ముమ్మరంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయమాధురి, ఈవోపీఆర్డీ రమాకుమారి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : వడ్డాది పంచాయతీలో గ్రామ స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలు ప్రారంభించారు. తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి ఉప సర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు పూలమాల వేసి అంజలి ఘటించారు. ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ చేశారు. మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో లవరాజు, స్థానిక నేతలు నాయకులు దొండా సన్యాసిరావు, దొండా నరేష్, నారాయణమూర్తి, దాడి గోవిందరావు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : స్వచ్ఛత హీ సేవాపై మండలంలోని మాకవరపాలెం, తామరం, లచ్చన్నపాలెం, కొండలఅగ్రహారం, జెడ్.గంగవరంతో పాటు మరికొన్ని గ్రామాల్లో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతమహాలక్ష్మి, మాకవరపాలెం ఈవో బాలదొర ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాతవరం : మండల కేంద్రంలో స్వచ్ఛత హీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, జనసేన నాయకులు సూర్యచంద్ర, సర్పంచ్ గొలగాని రాణి, ఎంపీటీసీ కరక రేణుక తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : మండలంలో పలు గ్రామాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు ఆయా గ్రామ సర్పంచ్‌లు చేపట్టారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశాలు, గ్రామస్థులు పాల్గొన్నారు. మేడివాడలో గ్రామ సర్పంచ్ వజ్రపు లీలా నాగవెంకటరత్నశివల ఆధ్వర్యంలో 150 మొక్కలు నాటారు. గుడ్డిపలో సర్పంచ్ గుమ్మాల గణేశ్వరావు ఆధ్వర్యంలో గ్రామంలో చెత్త ఊడ్చి వీధులు శుభ్ర పర్చారు. గిరిజన పంచాయతీ చీమల పాడులో సర్పంచ్ వంజరి గంగరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

చీడికాడ : ప్రతి ఇంటి వద్ద అందరూ మొక్కలు పెంచాలని వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కోరారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలో జెబి.పురం, అప్పలరాజుపురం గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పలు మొక్కలు మంగళవారం నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గొల్లవిల్లి చిన్నమ్మలు, చుక్క అప్పలనాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి గవిరెడ్డి జగన్నాథం, కురచా స్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


దేవరాపల్లి : గర్భింగిలో మానవహారం

దేవరాపల్లి : మండలంలోని గర్భింగిలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేసి, ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, సర్పంచ్ రాము, కార్యదర్శి యశోద, చెరకాన సూర్యనారాయణ, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గొలుగొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో డేవిడ్‌రాజ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ సుధ, సర్పంచ్ కసిపల్లి చినప్పారావు, కార్యదర్శులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు


కె.కోటపాడులో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నేతలు

కె.కోటపాడు, సెప్టెంబరు 17 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొట్టాన ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సీనియర్ బీజేపీ నాయకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని నాయకులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఇక్కడి 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సత్యనారాయణమూర్తి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైలా అమ్మాజీ, ఎస్.శివస్వామినాయుడు, జనపరెడ్డి సూర్యనారాయణ, బండారు సత్యనారాయణ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం : మండలంలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బీజేపీ మండల అధ్యక్షుడు మర్రి నాయుడు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అడిగర్ల రాంబాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

రోలుగుంటలో,,

రోలుగుంట : మండలంలోని బుచ్చెంపేటలో బీజేపీ మండల అధ్యక్షుడు కర్రి తమ్మునాయుడు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ యూత్ నాయకులు కర్రి వెంకటరమణ (బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.


మాకవరపాలెం : మొక్కలు నాటుతున్న బీజేపీ నేతలు


రోలుగుంటలోని బుచ్చెంపేట పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ

సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

మాకవరపాలెం, సెప్టెంబరు 17 : స్థానిక సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్సు బుక్స్ పంపిణీ చేశారు. శెట్టిపాలెం, భీమబోయినపాలెం గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న సుమారు 60 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిషోరు, సత్యసాయి ట్రస్ట్ ఆర్గనైజరు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సేవా కార్యక్రమాలు



నాతవరం, సెప్టెంబరు 17 : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ నాయకుడు యర్రా సూర్యనారాయణ ఆధ్వర్యంతో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎల్.విక్రమ్, వానపల్లి భవానీ బూషీ, సబ్బీ కూమారస్వామి ఈర్లె శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


కె.కోటపాడులో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు, సెప్టెంబరు 17 : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలరాజుతో పాటు తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంఈవో-1, 2 సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలో తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాము, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట : రక్తహీనత నివారణకు నులిపురుగుల నివారణ కార్యక్రమం ఎంతో ప్రయోజనకరమని ఎంఈవో జగ్గారావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కుసర్లపూడి జడ్పీ పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం డీవార్మింగ్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శెట్టి మోహన్‌రావు, అప్పన రాంబాబు పాల్గొన్నారు.


మాకవరపాలెం : తూటిపాల స్కూలు మాత్రల పంపిణీ

ఘనంగా విశ్వకర్మ జయంతి


విశ్వకర్మ జయంతి పూజల్లో భక్తులు

చోడవరం, సెప్టెంబరు 17 : పట్టణంలోని పెదబజారువీధిలోని కామాక్షిదేవి ఆలయంలో మంగళవారం ఉదయం ఐదు జంటల పూజలతో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు పట్నాల జగదీశ్వరరావు, కోనేటి రాజు, వి.మూర్తి, ఆచారి, బెన్నయాచారి, నూకాచారి, ముత్యాల శివ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఎంకేపట్నంలో 'ఉపాధి' అక్రమాలపై నిలదీత

రోలుగుంట, సెప్టెంబరు 17 : ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ దేముడు అక్రమాలకు పాల్పడ్డారంటూ ఎంకే పట్నం గ్రామస్థులు ఆరోపించారు. మండలంలోని ఎంకేపట్నంలో మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభలో గ్రామస్థులు దీనిపై నిలదీశారు. గ్రామానికి చెందిన 86 ఏళ్ల వృద్ధుడు పోతల గౌరినాయుడు పేరున 80 రోజులు పనిదినాలు వేసి రూ.20 వేలు స్వాహా చేసినట్లు ఫిర్యాదు చేశారు. అలాగే సూరెడ్డి కాసులమ్మ, సత్తిబాబులు పనులకు వెళ్లకుండానే తమ పేర్ల మీద 90 రోజుల పాటు మస్టర్లు వేసి రూ.25 వేలు తీసుకున్నట్టు ఆరోపించారు. అలాగే పోతల గౌరమ్మ, కోరా పోతురాజులు పనులకు వెళ్లకుండానే దొంగ మస్టర్లు వేసి నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించారు. అర్హులైన వారు ఉన్నా నేటికీ ఉపాధి కార్డులు జారీ చేయలేదని ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేశారు. ఈ గ్రామసభలో ఏపీవో సూర్యమణి, డీఆర్పీ రాజు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న రాంబాబు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 17 : గున్నెంపూడి జడ్పీ హైస్కూలులో గత ఏడాది పదో తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు తన తండ్రి గోదావరయ్య జ్ఞాపకార్థం మంగళవారం జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముచ్చకర్ల హరిణి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, స్కూల్ కమిటీ చైర్మన్ రమణ, కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో-2 పోస్టులు రద్దు తగదు

నర్సీపట్నం, సెప్టెంబరు 17 : ఎంఈవో-2 పోస్టులు రద్దు చేసి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అదనపు అధికారాలు బదలాయింపు ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అడిగర్ల వరహాలనాయుడు, జీవీ రమేశ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల నిర్వహణలో హెచ్‌ఎంలకు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. వారికి అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల విద్యా వ్యవస్థ కుంటుపడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

నేడు దిబ్బపాలెంలో అన్నసమారాధన


చీడికాడ, సెప్టెంబరు 17: ఈనెల 18న మండలంలోని దిబ్బపాలెంలో భారీస్థాయిలో అన్నసమారాధన నిర్వహించనున్నట్టు టీడీపీ జిల్లా నాయకులు గౌరీపట్నపు నానాజీ మంగళవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. వినాయక సంబరాల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పలువురు మండల స్థాయి నాయకులు పాల్గొంటారని తెలిపారు.

మంచినీటి పథకం ప్రారంభం


ఎరుకుల వీధిలో పథకం ప్రారంభిస్తున్న ఎంపీటీసీ రామకృష్ణ


రోలుగుంట, సెప్టెంబరు 17 : మండల కేంద్రం రోలుగుంటలో తాగునీటి కొరత లేకుండా తగిన నివారణ చర్యలు తీసుకుంటున్నామని ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఎరుకుల వీధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకును ప్రారంభించారు. గ్రామాల్లో తమ కూటమి ప్రభుత్వం హయాంలో ప్రత్యేక మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే అన్ని కాలనీల్లో ఎటువంటి తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హిందీలో టాపర్స్‌కు బహుమతులు


ప్రిన్సిపాల్ రాధ, టీచర్లతో విద్యార్థులు

దేవరాపల్లి, సెప్టెంబరు 17 : హిందీ బాషా దినోత్సవం సందర్భంగా.. ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం ప్రిన్సిపాల్ బి.రాధ, హిందీ ఉపాధ్యాయిని ఎస్.నిర్మల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 12 మందికి ఈ ప్రోత్సాహకాలను అందించారు. నూటికి 97 మార్కులు సాధించిన భానుప్రసాద్, 94 మార్కులు సాధించిన కె.ఎర్రునాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వసీమెల్లా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐతో నేతల భేటీ



చీడికాడ, సెప్టెంబరు 17 : చీడికాడ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన బి.సతీష్‌ను మంగళవారం ఖండివరం గ్రామ ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎస్ఐని కలిసిన వారిలో సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, మండల పరిషత్ కో-ఆప్షన్ మెంబరు షేక్ సూర్యనారాయణ, వేచలపు కామేష్ ఉన్నారు.